# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-09-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అర్హులైన ప్రతి ఒక్కరికి బ్యాంకింగ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకు అధికారులకు సూచించారు.**

2. **తెలంగాణలో జరిగే "హైదరాబాద్ విమోచన దినోత్సవ" అధికారిక వేడుకల్లో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఈరోజు పాల్గొంటారు.**

3. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా ఈరోజు నుంచి నెల రోజుల పాటు 'సేవా సంకల్ప అభియాన్' నిర్వహిస్తున్నట్లు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

4. **యువత సాధికారతే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.**

==========================

అర్హులైన ప్రతి ఒక్కరికి బ్యాంకింగ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకు అధికారులకు సూచించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ – ఎస్ఎల్‌బీసీ నిన్న సమావేశమైంది. ఈ సందర్భంగా వ్యవసాయ రుణాలతో పాటు వివిధ వర్గాలకు బ్యాంకులు అందిస్తున్న రుణాలు, సేవలపై సమావేశంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. అన్ని రంగాలు, వర్గాలను బలోపేతం చేసేలా బ్యాంకు రుణాలు అందించాలని కోరారు. అలాగే వ్యవసాయం, దాని అనుబంధ శాఖలపై కూడా ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ముందస్తు అంచనాలతో పంటల సాగు, ఉత్పత్తి, మార్కెట్ నిర్వహణపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

--------------------------

హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. భారతదేశానికి 1947 ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ.. హైదరాబాద్ సంస్థానంలో మాత్రం మరో 13 నెలల పాటు నిజాం పాలన సాగింది. చివరికి నాటి కేంద్ర హటరీంశాఖ మంత్రి సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ నేతృత్వంలో 1948 సెప్టెంబర్ 17న భారత ప్రభుత్వ 'ఆపరేషన్ పోలో" సైనిక చర్య ద్వారా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైంది. దీంతో ప్రతి ఏటా సెప్టెంబర్ 17ను హైదరాబాద్ విమోచన దినోత్సవంగా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్‌ను విముక్తి చేసిన అమరవీరులను స్మరించుకోవడంతో పాటు యువతలో దేశభక్తి

స్ఫూర్తిని నింపడమే ఈ దినోత్సవ నిర్వహణ లక్ష్యం.

కాగా సెప్టెంబర్ 17ను తెలంగాణలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 'తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోంది.

---------------------------

ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఈరోజు తెలంగాణలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "హైదరాబాద్ విమోచన దినోత్సవ" అధికారిక వేడుకల్లో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసు బలగాల గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తదితరులు హాజరుకానున్నారు.

మరోవైపు, హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఈరోజు నుంచి నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప అభియాన్' నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో కేంద్రమంత్రి నిన్న మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ అందించిన సేవలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రధానమంత్రికి మద్దతుగా ప్రజలు 'ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కేంద్ర మంత్రి సూచిస్తూ..

వాయిస్ ..28.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ముందుగా శ్రీ కాశీ విశ్వనాథుడిని దర్శించుకుంటారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో పాల్గొంటారు. ఇందులో భాగంగా వారణాసిలో నిర్వహిస్తున్న 'వారణాసి-వాద్నగర్ సేవా యాత్ర' ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ముఖ్యమంత్రి తిరిగి అమరావతి చేరుకుంటారని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రపంచ రోగి భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈరోజు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. రోగికి వైద్యం అందించడం ఎంత ముఖ్యమో.. ఆ వైద్యం వల్ల ఎలాంటి హాని కలగకుండా చూడటం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం సందర్భంగా వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్య

సిబ్బందితో పాటు రోగులు, వారి కుటుంబ సభ్యులకు కూడా సురక్షిత వైద్యం, మందుల భద్రతపై అవగాహన కల్పించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు.

-----------------------------

యువత భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తని, వారి సాధికారతే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురంమన్యం జిల్లా సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'యువత భవితకు భరోసా' కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతతో మంత్రి ముచ్చటించి విద్య, ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్ లక్ష్యాలపై వారితో చర్చించారు. యువతకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ ..33.. సెకన్లు

-----------------------------

తిరుమలలో శ్రీవెంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత రాత్రి మలయప్పస్వామి వారు సరస్వతి అమ్మవారి అలంకారంలోమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. దీనిపై ఆకాశవాణి తిరుపతి జిల్లా ప్రతినిధి ఎన్.జగదీష్ మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్ ..27.. సెకన్లు

-----------------------------

కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా నైరుతి బంగాళాఖాతం వరకు ద్రోణి విస్తరించి ఉందని, దీంతోపాటు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ జిల్లాలలో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

మరోవైపు తెలంగాణలోనూ రానున్న నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================